క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే రాక

కమలాపురం: మండలంలోని చిన్నచెప్పలి సచివాలయం పరిధిలోని సి.రాజుపాళెం, ఎల్లారెడ్డి పల్లె సచివాలయ పరిధిలోని జి.అప్పాయపల్లిలో సోమవారం జరిగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి హాజరు కానున్నారని ఎంపీడీఓ శేషాచలపతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల మండల స్థాయి అధికారులు ఈ కార్యక్రమానికి పూర్తి సమాచారంతో హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు.

కెరీర్ గైడెన్స్, వ్యక్తిత్వ వికాసంపై అవగాహన సదస్సు


గురుకుల పాఠశాల వద్ద జేఎన్‌టీయూ హెల్పింగ్ హ్యాండ్స్ విద్యార్థులు

పులివెందుల రూరల్ : పట్టణంలోని స్థానిక జేఎన్‌టీయూ కళాశాలకు చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ విద్యార్థులు పట్టణంలోని కడప రోడ్డులో ఉన్న సోషల్ వెల్ఫేర్ స్కూలు, హాస్టల్‌లో గురుకుల విద్యార్థులకు కెరీర్ గైడెన్స్, వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు. అలాగే హెల్పింగ్ హ్యాండ్స్ విద్యార్థులు మెమరీ టెక్నిక్స్, వాటి మీద సందేశాలు ఇచ్చారు. విద్య ఎలా చదువుకోవాలి, ఎలా సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్న అంశం మీద ఆసక్తికరమైన ఆటలు నిర్వహించారు. గెలిచిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కళాశాల ప్రిన్సిపల్ వసుంధర, వైస్ ప్రిన్సిపల్ సూర్యనారాయణరెడ్డి, హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు, ఇన్‌చార్జి సాంబయ్య పాల్గొన్నారు.

నేడు జాతీయ చేనేత దినోత్సవ ర్యాలీ

జమ్మలమడుగు: జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా పట్టణంలో సోమవారం ర్యాలీ నిర్వహించనున్నట్లు బీసీ సంక్షేమ ప్రధాన కార్యదర్శి బడిగించల చంద్రమౌళి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జమ్మలమడుగు నియోజకవర్గంలో అత్యధికంగా చేనేత వర్గాలు ఉన్నారు. చేనేతలకు రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ నేతన్న నేస్తం ద్వార ప్రతి ఏడాది 24వేల రూపాయలు చేనేతల ఖాతాలలో వేసి ఆదుకుంటోందన్నారు. సోమవారం ఉదయం మోరగుడి క్రాస్ వద్ద ఉన్న చేనేత నాయకులు మాజీ ఎమ్మెల్యే కుండా రామయ్య విగ్రహానికి పూలమాల వేసి ర్యాలీ నిర్వహిస్తామన్నారు. చేనేత కార్మికులు నాయకులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

పేదలకు వైద్య విద్యను దూరం చేయొద్దు

కమలాపురం: పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసే జీఓ నెంబర్ 107, 108లను ఉపసంహరించుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు చిన్ని, వీరణాల శివకుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం వారు కమలాపురంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా మన రాష్ట్రంలో వైద్య సీట్లను వర్గీకరణ కింద విభజించడం అన్యాయం అన్నారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా రాష్ట్రానికి మంజూరు చేసిన 750 సీట్లలో జాతీయ మెడికల్ కౌన్సిలింగ్ ద్వారా 112 సీట్లను అన్ని రాష్ట్రాల వారికి ప్రతిభ ఆధారంగా కేటాయిస్తారన్నారు. మిగిలిన 638 సీట్లలో ప్రభుత్వం తీసుకువచ్చిన జీఓ వలన 319 సీట్లు సాధారణ విభాగానికి కేటాయించడం అన్యాయం అన్నారు. రాజ్యాంగంలో 46 అధికరణ ప్రకారం షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగలు ఇతర బలహీన వర్గాల ప్రయోజనాలను కాపాడాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు నరసింహులు పాల్గొన్నారు.

10న నులిపురుగుల నివారణ మందుల పంపిణీ

పెద్దముడియం: ఈ నెల 10న నులిపురుగుల నివారణ మందులు పంపిణీ చేయనున్నట్లు మేడిదిన్నె పీహెచ్‌సీ వైద్యుడు డా.హుస్సేన్ ఒక ప్రకటనలో తెలిపారు. పీహెచ్‌సీ పరిధిలోని అన్ని అంగన్వాడి కేంద్రాలు,పాఠశాలలలో నులిపురుగుల నివారణ కోసం ఆల్బెండాజోల్ మాత్రలు అందుబాటులో ఉంటాయని పిల్లలందరికీ వేయించాలని తెలిపారు.

మాజీ మంత్రి మైసూరారెడ్డి ప్రత్యేక పూజలు


మైసూరాను సన్మానిస్తున్న ఆలయ నిర్వాహకులు

కమలాపురం: మాజీ మంత్రి మైసూరారెడ్డి సీతారామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని కొండాయపల్లెలో ఇటీవల నూతనంగా నిర్మించిన సీతారామాలయ ప్రతిష్ట మహోత్సవాలకు రాలేని కారణంగా ఆయన ఆదివారం రాత్రి ఆలయానికి విచ్చేశారు. స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా ఆలయ నిర్వాహకులు మహేశ్వర్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి తదితరులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన్ను సత్కరించారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు సీఎస్ నారాయణరెడ్డి, ఓ.శ్రీనివాసులురెడ్డి, అయ్యవార్ యాదవ్, గండి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్‌లో హింసను ఆపండి


కమలాపురం.. శాంతి ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు


జమ్మలమడుగు.. శాంతి ర్యాలీ నిర్వహించిన క్రైస్తవులు

జమ్మలమడుగు: మణిపుర్‌లో శాంతిని నెలకొల్పడంతో పాటు క్రైస్తవ మహిళలను రక్షణ కల్పించాలంటూ పట్టణంలోని క్రైస్తవులు, చర్చి ఫాదర్లు ,ప్రజా సంఘాలు ర్యాలీ నిర్వహించారు. ఆదివారం సాయంత్రం పట్టణంలోని సెయింట్ మేరీస్ స్కూల్ వద్దనుంచి సంజామలమోటు, తిరిగి పాత బస్టాండ్ వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా పాస్టర్లు బడుగు శ్యాంసన్,థామస్‌బాబు, జయకుమార్ మధుబాబు, బోనం ప్రభు కుమార్, బత్తల ప్రవీన్ మాట్లాడారు.కొన్ని అరాచక శక్తులు మతపరమైన దాడులు చేయడం వల్లదేశానికి చెడ్డపేరు వచ్చే ప్రమాదం ఉందన్నారు.ప్రభుత్వాలకు దేవుడు మంచి బుద్ధిని ప్రసాదించి ఆ రాష్ట్రాలలో శాంతి వాతావరణం ఏర్పడేవిధంగా ప్రభుత్వాలు కృషిచేయాలని సూచించారు.

కమలాపురం: కేంద్ర ప్రభుత్వం స్పందించి మణిపూర్‌లో జరుగుతున్న హింసను, క్రైస్తవులపై దాడులను ఆపాలని కమలాపురం పట్టణ చర్చిల పాస్టర్లు డిమాండ్ చేశారు. ఆదివారం కమలాపురం పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఖాజీపేట రోడ్డులోని మన్నా చర్చి నుంచి క్రాస్ రోడ్డు వరకు భారీ శాంతి ర్యాలీ నిర్వహించారు. మణిపూర్‌లో హింసను ఆపాలి.. క్రైస్తవుల పై జరుగుతున్న దాడులను అరికట్టాలి.. కేంద్ర ప్రభుత్వం స్పందించి తక్షణం గట్టి చర్యలు తీసుకోవాలని ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సంధర్భంగా పాస్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ప్రభుదాస్, సెక్రటరీ సునీల్‌దత్ మాట్లాడుతూ మూడు మాసాలుగా మణిపూర్‌లో మారణకాండ జరుగుతోందని, అసలు అక్కడ ప్రభుత్వం ఉందా అని ప్రపంచ వ్యాప్తంగా అనుమానాలు రేకెత్తుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సున్నితమైన సమస్య ను ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలన్నారు. లేని పక్షంలో దాడులు మరిన్ని పెరిగే అవకాశాలున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. వివిధ చర్చిలు పాస్టర్లు భరత్ హెరాల్డ్, ఐక్యతరావు, రాజేష్, సీహెచ్ సామ్యేలు, రాజు, జాషువ, విజయ్, పి.సామ్యేలు, శౌరీ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పరిశోధన ఫలితాలను సద్వినియోగం చేసుకోవాలి

– వైఎస్సార్‌సీపీ నేత వైఎస్ మధురెడ్డి


రైతు పరిశోధన సంస్థ ప్రతినిధులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేత మధురెడ్డి, తదితరులు

పులివెందుల రూరల్ : నిరంతర వ్యవసాయ పరిశోధన ఫలితాలను రైతు మిత్రలు సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ నేత వైఎస్ మధురెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని చెన్నారెడ్డి కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన రైతు పరిశోధన సంస్థను వైఎస్సార్‌సీపీ నేత వైఎస్ మధురెడ్డి రైతు పరిశోధన సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ రామిశెట్టి శివశంకర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రామిశెట్టి శివశంకర్ మాట్లాడుతూ పదేళ్లల్లో తన పరిశోధన ఫలితాలను రైతులకు వివరించామన్నారు. మట్టిలో సేంద్రీయ కర్బనం పెంచడం, ప్రతి పంటకు సంబంధించిన పరిశోధన గ్రంథాలు తయారు చేయడం, ఫలితంగా రైతులు సుస్థిరాభివృద్ధి సాధించే విధంగా రైతు పరిశోధన సంస్థ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, సంస్థ వైస్ ప్రెసిడెంట్ కె.పీరా, ప్రిన్సిపల్ సైంటిస్ట్, రాయలసీమ పండ్ల తోటల సమాఖ్య అధ్యక్షుడు విజయభాస్కర్ రెడ్డి, డీవీఎంసీ మెంబర్ కిశోర్ పాల్గొన్నారు.

హోమియో వైద్య శిబిరానికి విశేష స్పందన


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ శేషఫణి


రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ నవీన్ కుమార్‌రెడ్డి

వేంపల్లె : స్థానిక శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి కళ్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన ఉచిత హోమియో వైద్య శిబిరానికి విశేష స్పందన లభించినట్లు అధ్యక్షుడు గోవర్ధన్ తెలిపారు. ఈ వైద్య శిబిరంలో 180మందికి డాక్టర్ క్రిష్టిపాటి వెంకట శేషఫణి వైద్య పరీక్షలు చేశారు. వేంపల్లె ఆవోపా వారు వీరికి హోమియో మందులను పంపిణీ చేశారు. ఈ వైద్య శిబిరానికి కొప్పరపు రాజగోపాల్ కుటుంబ సభ్యులు ఆర్థిక సాయం చేశారు. ఆవోపా ఆర్గనైజర్ సాయిసత్యనారాయణ, సెక్రటరీ రాధాకృష్ణ, ట్రెజరర్ రాము, సభ్యులు శివ కిరణ్, శివ అరుణ్, సాయి కిరణ్, కౌశిక్, కిరణ్, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

కమలాపురం: మండల పరిధిలోని పెద్దచెప్పలిలో ఆదివారం సహస్ర ఫౌండేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. కడప నగరానికి చెందిన కేఎస్ఆర్ హాస్పిటల్ వారి సహకారంతో నిర్వహించిన ఈ శిబిరానికి వివిధ గ్రామాల నుంచి వచ్చిన 350 మంది రోగులను ప్రముఖ ఫిజీషియన్ నవీన్ కుమార్‌రెడ్డి, డాక్టర్ విజయలక్ష్మీ పరీక్షించి వైద్య సేవలు అందజేశారు. బీపీ, షుగర్, థైరాయిడ్, విష జ్వరాలు, మలేరియా, డెంగ్యూ, గుండె సమస్యలున్న రోగులను పరీక్షించి వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. సహస్ర ఫౌండేషన్ అధ్యక్షులు నాగమల్లారెడ్డి, బాసట ఈశ్వరయ్య, విజయ్ కుమార్, దామోదర్, మనోజ్, లక్ష్మీ చెన్నకేశవ, శివ కుమార్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

అర్హులకు సాగుభూమి పంపిణీ చేయాలి


మాట్లాడుతున్న ఎంవీ సుబ్బారెడ్డి

ఎర్రగుంట్ల : అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల పేదలకు సాగుభూమిని అందజేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎంవీ సుబ్బారెడ్డి తెలిపారు. ఆదివారం భారత కమ్యూనిస్టు పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతమున్న అసైన్మెంట్ కమిటీ స్థానంలో గతంలో మాదిరిగా అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో కూడిన కమిటినీ ఏర్పాటు చేసి.. అర్హులను గుర్తించి సాగు భూమిని అందజేయాలన్నారు. సీపీఐ పార్టీ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ఈ నెల 17వ తేదీన బస్సు యాత్ర ప్రారంభమవుతుందన్నారు. అన్ని సమ్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు పర్యటించనున్నట్లు వివరించారు. ఈ బస్సు యాత్ర ఈ నెల 31వ తేదీన యర్రగుంట్ల పట్టణం ఉదయం చేరుకుంటుందని ఈ యాత్రను జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి భవానిశంకర్, ఏఐటీయూసీ నాయకులు రాధాకృష్ణ షరీఫ్, నాగేంద్రలు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


కళా జాగృతి కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ సదాశివయ్య

జమ్మలమడుగు: ప్రజలు ఆన్‌లైన్ మోసాలపై జాగ్రత్తగా ఉండాలని అర్బన్ సీఐ సదాశివయ్యపేర్కొన్నారు. శనివారం రాత్రి మండల పరిధిలోని గూడెం చెరువు గ్రామంలో పరివర్తన కార్యక్రమంలో భాగంగా కళా జాగృతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గూడెంచెరువు వాసులు ఎక్కువ మంది రైతు పనులు చేసుకోవడంతోపాటు కష్టపడి పనిచేసుకుని జీవనం సాగించే వారు ఉన్నారు. మట్కా, గ్యాంబ్లింగ్‌వంటి వ్యసనాలతో చాలా మంది కుటుంబాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. మగ వారు కష్టపడి సంపాదించిన సొమ్ముతో తమ పిల్లలను బాగా చదివించుకోవాలని సూచించారు. నాటు సారా తాగి ఆరోగ్యాలకు పాడుకుంటే తమ కుటుంబాలు వీధిన పడుతాయని హెచ్చరించారు. ఎస్ఐ సుబ్బారావు, స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ ఎస్ఐ లత, తదితరులు పాల్గొన్నారు.

రైతన్నకు మైలవరం


సోయాబిన్ పంటకు నీటి తడిని అందిస్తున్న దృశ్యం


మైలవరం దక్షిణ కాలువలో పారుతున్న నీరు

పెద్దముడియం: మైలవరం జలాశయం నీరు రైతులకు వరంగా మారింది. సరైన వర్షాలు లేక బీడుగా మారిన భూములకు మైలవరం దక్షిణ కాలువ నుంచి నీటి తడులు అందిస్తున్నారు. తడుల తర్వాత మిరప సాగు చేస్తామని మండల రైతులు తెలుపుతున్నారు. అలాగే ఇదివరకే మండలంలో పలువురు రైతులు ఖరీఫ్‌లో ముందుగా సోయాబిన్,మొక్కజొన్న,మినుము తదితర పంటలను సాగు చేశారు. వర్షాలేక ఇబ్బందులు పడ్డారు. ఈ నేపథ్యంలో రైతులు మైలవరం జలాశయం నుంచి కాలువలకు వచ్చే నీటి ద్వారా పంటలకు నీటి తడులు అందిస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో బోగాదమ్మకు పూజలు

వీరపునాయునిపల్లె: మండలంలోని అనిమెల గ్రామ సమీపంలో కోరుకొండపై వెలసిన బోగాదమ్మ తల్లికి ఆదివారం భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారిని దర్శించుకొనేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. అనంతరం భక్తులకు ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

చింతకొమ్మదిన్నె : కొత్తపేట-బుగ్గలేటిపల్లి సరిహద్దుల్లో గల గంగమ్మతల్లి ఆలయంలో ఆదివారం అమ్మ వారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోర్కెలు తీరిన భక్తులు అమ్మవారికి ముద్దలను ఏర్పాటు చేసి ఆభరణాలను, పట్టు వస్త్రాలను కానుకలుగా సమర్పించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ చైర్మన్ పార్వతమ్మగారి విశ్వనాథ్ రెడ్డి, ఆలయ కార్యనిర్వహణ అధికారి సురేష్ కుమార్ రెడ్డి ఏర్పాట్లు చేశారు. పోతురాజు వద్ద ముద్దలను ఏరాటు చేసి జంతుబలులు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణంలోని పచ్చని చెట్ల మధ్య బంధుమిత్రులతో విందుభోజనాలను ఆరగించారు. అలాగే ఆలయ సమీపంలోని ఆంజనేయ స్వామి, సాయిబాబా, వైద్యనాథేశ్వరుడు, అక్కదేవతలకు భక్తులు పూజలు నిర్వహించారు.

వైభవంగా పీర్ల ఊరేగింపు


పీర్లను ఎత్తుకొని అగ్ని గుండ ప్రవేశం చేస్తున్న భక్తులు

లింగాల : మండల పరిధిలోని తేర్నాంపల్లె గ్రామంలో ఆదివారం పీర్ల పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో పీర్ల ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. హిందు, ముస్లిం సోదరుల ఐకమత్యంతో పీర్ల ఊరేగింపు నిర్వహించారు. పీర్లను ఎత్తుకుని అగ్నిగుండ ప్రవేశం చేశారు. అనంతరం గుండం పూడ్చి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం


ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

సింహాద్రిపురం : మండలంలోని అంకాలమ్మ గూడూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1982–87 సంవత్సరాలలో చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పాఠశాలలో చదువుకుంటున్న సమయంలో జరిగిన జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఆనందంగా గడిపారు. అనంతరం తమకు విద్యను బోధించిన గురువులను సత్కరించారు. ఈ సందర్భంగా పూర్వపు విద్యార్థులు సహపంక్తి భోజనం చేశారు. పూర్వపు విద్యార్థులు అప్పటి ఉపాధ్యాయులతో ఫొటోలు తీసుకున్నారు.

అలరించిన నృత్యాలు

పులివెందుల టౌన్: పట్టణంలోని స్థానిక శిల్పారామంలో ఆర్ఆర్ఆర్ రెస్టారెంట్‌అండ్ కేఫ్ సహకారంతో శ్రీరాజాకళా నిలయం శిష్య బృందంచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా చిన్నారులు జానపద, శాస్త్రీయ, వెస్టన్ పాటలకు వేసిన నృత్యాలు అలరించాయి. పెద్ద సంఖ్యలో సందర్శకులు శిల్పారామానికి రావడంతో కిక్కిరిసిపోయింది. కార్యక్రమంలో నృత్య శిక్షకుడు రాజా, సేవా సమితి అధ్యక్షుడు రాజు, శిల్పారామ ఏఓ సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా హుసేన్‌పీర్ దర్గా ఉరుసు

– వేలాదిగా తరలివచ్చిన భక్తులు


దర్గాను సుందరంగా అలంకరించిన దృశ్యం

బద్వేలు అర్బన్ : పట్టణంలోని దర్గావీధిలో వెలసిన హుసేన్ పీర్ దర్గా 198వ ఉరుసు మహోత్సవాలు స్వామి వారసులు దర్గారహమతుల్లా సాహెబ్, దర్గా షఫివుల్లా సాహెబ్ ఆధ్వర్యంలో రెండవ రోజైన ఆదివారం ఘనంగా జరిగాయి. ఉరుసు సందర్భంగా బద్వేలు నియోజకవర్గంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి భారీగా భక్తులు తరలిరావడంతో దర్గా ఆవరణమంతా భక్తులతో కిక్కిరిసింది. ఇందులో భాగంగా తెల్లవారుజామున స్వామి వారసులు గంధం ఎత్తుకుని ఊరేగింపుగా వెళ్లి స్వామి మజార్లకు ఎక్కించి అనంతరం దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దర్గా ఆవరణలో మొక్కుబడి ఉన్న భక్తులు అన్నదానం నిర్వహించారు. చివరిరోజు కావడంతో భక్తులు వేలాదిగా తరలివచ్చారు. ఉరుసు సందర్భంగా రాత్రి ఏర్పాటు చేసిన ఖవ్వాలి విశేషంగా ఆకట్టుకుంది. అలాగే పకీరుల విన్యాసాలు అబ్బురపరిచాయి. స్వామి వారసులు దర్గామహమ్మద్ కరీముల్లా, దర్గామున్వర్, దర్గాసలీం, ఆర్గనైజర్లు అన్వర్‌బాషా, సిమెంట్ షరీఫ్, అంజాద్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అర్బన్ సీఐ జీ.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

అంకాలమ్మ గూడూరు ఎస్సీ కాలనీకి కొత్త కళ

– ఎంపీకి కృతజ్ఞతలు తెలిపిన ప్రజలు


కంపచెట్లను తొలగించడంతో పరిశుభ్రంగా ఉన్న అంకాలమ్మ గూడూరు ఎస్సీ కాలనీ

సింహాద్రిపురం : మండల పరిధిలోని అంకాలమ్మ గూడూరు గ్రామంలోని ఎస్సీ కాలనీ పరిసర ప్రాంతాలు పరిశుభ్రమయ్యాయి. గతంలో ఇక్కడి పరిసరాలు అపరిశుభ్రంగా ఉండి సమీపంలోని ఇళ్లలోకి పాములు వస్తున్నాయి. ఇటీవల అంకాలమ్మ గూడూరు గ్రామానికి చెందిన హోంగార్డు రామాంజనేయులుకు చెందిన ఇద్దరు పిల్లలు పాము కాటుకు గురై మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు వెళ్లినప్పుడు రామాంజనేయులు దంపతులు కాలనీ పరిసర ప్రాంతాలు అపరిశుభ్రంగా ఉండటంవల్ల పాములు వస్తున్నాయని ఎంపీకి వివరించారు. దీనికి ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి స్పందించి కాలనీ చుట్టూ ఉన్న కంపచెట్లను తొలగించి పరిసర ప్రాంతాలను జేసీబీల సహాయంతో శుభ్రం చేయించారు. ఎస్సీ కాలనీ చుట్టూ ఉన్న అపరిశుభ్రతను తొలగించి శుభ్రం చేయడంతోపాటు వీధిలైట్లను కూడా వేయించారు. దీంతో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

బీటెక్ రవి వాస్తవాలు తెలుసుకోవాలి

సింహాద్రిపురం మండల ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి



పులివెందుల : తెలుగుదేశం పార్టీ నాయకుడు బీటెక్ రవి వాస్తవాలు తెలుసుకుని మాట్లాడితే బాగుంటుందని సింహాద్రిపురం మండల ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2022 ఖరీఫ్ ఇన్సూరెన్స్‌కు సంబంధించి సింహాద్రిపురం మండలంలోని బీటెక్ రవి కుటుంబ సభ్యులు అక్షరాలా రూ.5.31,456లు లబ్ధి పొందారని వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పార్టీలకు, కులమతాలకతీతంగా ప్రభుత్వ పథకాలను నిజమైన లబ్ధిదారులకు అందిస్తున్నారని తెలిపారు. స్వయంగా బీటెక్ రవి ప్రభుత్వం నుంచి లబ్ధి పొంది మళ్లీ ఇన్స్యూరెన్స్ విధానంపై ప్రభుత్వాన్ని విమర్శించడం సిగ్గు చేటని ధ్వజమెత్తారు. గతంలో ఇన్స్యూరెన్స్‌కు రైతులు పెద్ద ఎత్తున డబ్బులు చెల్లించేవారని.. అయితే వైఎస్సార్ సీపీ హయాంలో రైతులు ఒక్క రూపాయి ప్రీమియం మాత్రమే చెల్లించే విధంగా ఏర్పాటు చేశారని తెలిపారు. అలాగే రైతులు ఏ పంట వేశారు, ఎంత మేర నష్టపోయారన్న విషయాలు తెలియడానికే ఈ-క్రాప్ విధానం ఏర్పాటు చేశారని వివరించారు. నోరు తెరిస్తే అబద్ధాలు మాట్లాడే బీటెక్ రవి కానీ, ఆ పార్టీకి చెందిన నాయకులు కానీ రైతులకు, ప్రజలకు జరుగుతున్న మంచిని చూడలేక అర్ధరహితమైన విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా వాస్తవాలు మాట్లాడితే ప్రజలలో తగిన గౌరవం లభిస్తుందని ఆయన సూచించారు.